సమస్యలుంటే సాక్షికి చెప్పండి
మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి
97053 47483
నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మేయర్ పర్యటన


పేరుకుపోయిన చెత్తను పరిశీలిస్తున్న మేయర్ గొలగాని హరివెంకటకుమారి

బీచ్ రోడ్డు: తుపాను కారణంగా నగర ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు చేపట్టాలని మేయర్ గొలగాని హరివెంకట కుమారి అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటించారు. 21వ వార్డు చినవాల్తేరులో ప్రధాన కాలువల్లో వ్యర్థాలను తొలగించాలని జీవీఎంసీ సిబ్బందిని ఆదేశించారు. కోటక్ స్కూల్‌కు వెళ్లే మార్గంలో వ్యర్థాలు అధికంగా ఉండడాన్ని గమనించిన మేయర్ శానిటరీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై వ్యర్థాలు కనిపిస్తే సహించేది లేదని హెచ్చరించారు.

అర్ధరాత్రి వేళ యథేచ్ఛగా వ్యర్థాలు డంపింగ్


మైదానంలో పారబోసిన భవన నిర్మాణ వ్యర్థాలు

ఏయూ క్యాంపస్: అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలను ఏయూ మైదానంలో యథేచ్ఛగా డంపింగ్ చేసి వెళ్లిపోతున్నారు. నాలుగైదు రోజులుగా ఏయూ హాస్టళ్ల వెనక భాగంలో ఇటీవల అభివృద్ధి చేసిన మైదానంలో భారీ వాహనాలతో చెత్తను తీసుకొచ్చి పారబోస్తున్నారు. వాస్తవానికి వీటిని నగరానికి దూరంగా తీసుకువెళ్లి పారబోయాలి. ఇది ఎంతో ఖర్చుతో కూడుకున్నది. దీంతో దగ్గరలో ఉన్న ఏయూ మైదానంలో లారీల యజమానులు పారబోస్తున్నారు. దీనిపై వర్సిటీ సెక్యూరిటీ సిబ్బంది ప్రత్యేక నిఘా పెట్టాల్సిన అవసరం ఉంది.

9న లోక్ అదాలత్

బీచ్ రోడ్డు: ఈ నెల 9న జరగబోయే లోక్ అదాలత్‌కు రాబోయే కేసులపై బుధవారం మూడో పట్టణ పోలీసులు కసరత్తు చేశారు. రాజీకి వచ్చే వారి వివరాలను సేకరిస్తున్నారు. ముఖ్యంగా కుటుంబ కలహాలకు సంబంధించిన కేసులను లోక్ అదాలత్ ద్వారా రాజీ చేయడానికి కౌన్సిలింగ్ ఇవ్వనున్నారు.

ఘనంగా హోంగార్డ్స్ రైజింగ్ డే


బెస్ట్ హోంగార్డ్ అప్పారావుకు అవార్డు అందజేస్తున్న డీజీఎం సెహగల్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో హోంగార్డ్స్ రైజింగ్ డే ఘనంగా నిర్వహించారు. 61వ హోం గార్డ్స్ రైజింగ్ డేను బుధ వారం స్టీల్‌ప్లాంట్ టౌన్‌షిప్‌లోని హోం గార్డ్స్ బ్యారక్స్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా జనరల్ అడ్మినిస్ట్రేషన్ విభాగాధిపతి హెచ్.ఎం. సెహగల్, విశిష్ట అతిథిగా స్టీల్‌ప్లాంట్ హాస్పిటాలిటీ డీజీఎం టిటే హాజరై జెండా ఎగురవేశారు. హోం గార్డులు అందజేసిన గౌరవ వందనాన్ని ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా సెహగల్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఆస్తుల రక్షణలో హోంగార్డుల సేవలు విశిష్టమైనవన్నారు. టిటే మాట్లాడుతూ శాంతి భద్రతల రక్షణలో పోలీసులకు, ట్రాఫిక్ నియంత్రణలో భద్రతా విభాగానికి హోంగార్డులు అందిస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. ఈ సందర్భంగా కె. అప్పారావుకు బెస్ట్ హోంగార్డు అవార్డు, ప్రతిభ చూపిన హోంగార్డులు, పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. హోంగార్డ్స్ ఇన్‌చార్జి ఈ. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శ్వాసకు అభయం..!


ఇది కదా అభివృద్ధి

- ప్రభుత్వ చెస్ట్ ఆస్పత్రిలో మెరుగైన సేవలు
- అందుబాటులోకి ఐసీయూ యూనిట్
- 288 బెడ్స్‌తో పూర్తిస్థాయి సేవలు

ఏయూ క్యాంపస్: సెకను కాలం శ్వాస ఆగితే మనిషి బతకడం కష్టం. శ్వాస సంబంధ సమస్యలు ఎదురైతే ఎన్నో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఇటువంటి అనేక సమస్యలకు అవసరమైన సమగ్ర చికిత్సలను అందిస్తోంది ప్రభుత్వ శ్వాసకోశ, అంటువ్యాధుల ఆస్పత్రి(చెస్ట ఆస్పత్రి). ఊపిరితిత్తుల సమస్యలు, ఆస్తమా, నిమోనియా, లంగ్ క్యాన్సర్, టీబీ, దగ్గులో రక్తం పడడం, అన్ని రకాల ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలకు ఇక్కడ చికిత్స అందిస్తారు. మొత్తం 288 బెడ్‌లతో చెస్ట్ ఆస్పత్రి ప్రజలకు విశేష సేవలు అందిస్తోంది. ప్రస్తుతం 13 మంది ప్రొఫెసర్ స్థాయి వైద్యులు, ఐదుగురు వైద్యులు ఉన్నారు. మరో 50 మంది పీజీ విద్యార్థులు, 150 మంది నర్సింగ్ సిబ్బంది ఇక్కడ పని చేస్తున్నారు.

ఎన్ఏబీహెచ్ గుర్తింపు

ఆస్పత్రుల్లో వసతులు, ప్రమాణాలు, పరిశుభ్రత, మౌలిక సదుపాయాలు వంటివి పరిశీలించి అందించే నేషనల్ అక్రిడియేషన్ బోర్డ్ ఫర్ హాస్పిటల్స్ అండ్ హెల్త్‌కేర్ ప్రొవైడర్స్(ఎన్ఏబీహెచ్) గుర్తింపు ప్రభుత్వ ఛాతీ వైద్యశాలకు లభించింది. ప్రైవేటు వైద్యశాలలకు మాత్రమే సాధ్యమయ్యే ఈ ఎన్ఏబీహెచ్ గుర్తింపును ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి సాధించింది. దీని వెనక సూపరింటెండెంట్ సునీల్ కుమార్, సిబ్బంది కృషి ఎంతో ఉంది.


16 పడకలతో ఐసీయూ

ప్రభుత్వం అందించిన రూ.17 లక్షల నిధులతో ఇటీవల 16 పడకలతో కూడిన ఐసీయూని అందుబాటులోకి తీసుకొచ్చారు. వీటిలో వెంటిలేటర్లు, ఏబీజీ ఎనలైజర్ వంటివి పరికరాలను ఏర్పాటు చేశారు. శ్వాస సంబంధించిన అన్ని రకాల సమస్యలకు ఇక్కడ చికిత్స అందిస్తారు. రోగికి ఆక్సిజన్ శాతం ఎంత ఉంది అనేది తెలుసుకోవడానికి ఏబీజీ ఎనలైజర్‌ను ఉపయోగిస్తారు.

పరికరాలతో సుసంపన్నం

బ్రాంకోస్కోపి, థొరకోస్కోపీ సేవలు ఇక్కడ అందుబాటులో ఉన్నాయి. సాధారణ రక్త పరీక్షలతో పాటు, ప్రత్యేకమైన రక్తపరీక్షలు చేయడానికి అవసరమైన పరికరాలు సైతం ఇక్కడ ఉన్నాయి. సాధారణ ఎక్స్‌రే యంత్రంతో పాటు, దాతల సహాయంతో సమకూరిన డీఆర్, సీఆర్ మెషిన్‌లు ఉన్నాయి. జిల్లా కలెక్టర్ ఇప్పటి వరకు దాదాపు రూ.65 లక్షలకుపైగా వ్యయంతో ఆస్పత్రికి అవసరమైన మౌలిక వసతులు, పరికరాలను అందించారు. రోగి సహాయకుల సౌకర్యార్థం లాకర్లతో కూడిన షెడ్, భోజనశాలను ఇటీవల అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆస్పత్రి మొత్తం సీసీ కెమెరాలు, కార్పొరేట్ కార్యాలయాన్ని తలపించేలా క్యాబిన్లు ఆధునికీకరించారు.

ప్రత్యేకంగా ఆక్సిజన్ ప్లాంట్


నూతనంగా ఏర్పాటైన ఆక్సిజన్ ప్లాంట్

ఆస్పత్రిలో ప్రతి బెడ్‌కి నేరుగా ఆక్సిజన్ సరఫరా జరిగే వ్యవస్థ అందుబాటులో ఉంది. గతంలో ఏర్పాటైన ఆక్సిజన్ ప్లాంట్‌తో పాటు పదివేల లీటర్ల సామర్థ్యం కలిగిన లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ సైతం ఇటీవల ఏర్పాటు చేశారు. కోవిడ్ సమయంలో సైతం అత్యంత సమర్థవంతంగా సేవలు అందించారు.


రోగి సహాయకులు ఉండే గది


చెస్ట్ ఆస్పత్రి ప్రాంగణం


నూతనంగా ఏర్పాటైన ఐసీయూ


బ్రాంకోస్కోపి, థోరోస్కోపి పరీక్షించే విభాగం

సుశిక్షితులైన వైద్యబృందం	18 మంది
నర్సింగ్ సిబ్బంది	150 మంది
అందుబాటులో పీజీ విద్యార్థులు	50 మంది
రోజూ ఇన్‌పేషెంట్‌లు	15-20 మంది
రోజూ అవుట్ పేషెంట్‌లు	సుమారు 150 మంది

ఆస్పత్రి చాలా పరిశుభ్రంగా ఉంది..



మా అమ్మగారికి చికిత్స నిమిత్తం ఇక్కడికి తీసుకొచ్చాను. ఆస్పత్రి పరిసరాలు ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయి. మంచి నాణ్యమైన సేవలు వైద్యులు అందిస్తున్నారు.
– ఎ.సాయికుమార్, అక్కయ్యపాలెం

అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి..



ఆస్పత్రిలో అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయి. ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు లభిస్తున్నాయి. కలెక్టర్ ఉదారంగా స్పందిస్తూ ఆస్పత్రికి అవసరమైన మౌలిక వసతులు, పరికరాలను సమకూర్చారు.
– డాక్టర్ భూషణరావు, ఇన్‌చార్జి సూపరింటెండెంట్

పెరిగిన ఆస్పత్రి ప్రమాణాలు



ప్రైవేటు ఆస్పత్రులతో సమానంగా ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రమాణాలు పెరిగాయి. దీనికి అనుగుణంగా ఎన్ఏబీహెచ్ గుర్తింపు లభించింది. సిబ్బంది సమష్టిగా పనిచేస్తూ రోగులకు మెరుగైన సేవలు అందిస్తున్నారు.
– బి.ఎం.ఎస్.పాత్రుడు, ఆస్పత్రి సీనియర్ వైద్యుడు

అంబేడ్కర్ ఆలోచనలు ఆచరణీయం

- ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత
- వాడవాడలా అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమాలు


ఏయూలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వీసీ సమత

ఏయూ క్యాంపస్: డాక్టర బీఆర్ అంబేడ్కర్ ఆలోచనలు ఆచరణలో చూపడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి అని ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత అన్నారు. బుధవారం అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఏయూ పరిపాలనా భవనం వద్దనున్న ఆయన విగ్రహానికి వీసీ పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంబేడ్కర్ సిద్ధాంతాలు సమసమాజ స్థాపనకు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ప్రిన్సిపాళ్లు ఆచార్య నరసింహారావు, వి.విజయలక్ష్మి, ఆచార్య కె.విశ్వేశ్వరరావు, ఆచార్య టి.షారోన్‌రాజు, ఆచార్య పి.అర్జున్, ఆచార్య బి.మునిస్వామి, ఆచార్య పి.వెంకటేశ్వర్లు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


ఆరిలోవలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

ఏయూ క్యాంపస్: వర్సిటీలోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్ఆర్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ తుల్లి చంద్రశేఖర్‌యాదవ్ పూలమాల వేసి నివాళులర్పించారు.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు రామ్‌నగర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు పూలమాల వేసి నివాళులర్పించారు. జీవీఎంసీ 22వ వార్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు, పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్, తూర్పు నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు.. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.ఘనంగా నివాళులర్పించారు.

ఆరిలోవ: స్థానిక అంబేడ్కర్‌నగర్‌లో అంబేడ్కర్ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి మేయర్ గొలగాని హరివెంకటకుమారి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్, ఎస్సీ విభాగం జోనల్ ఇన్‌చార్జి అల్లంపల్లి రాజబాబు, నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ కె.మోహనరావు, సంఘం నాయకులు వి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్.నర్సిగ్, రమేష్, స్వరూప్ బాబూరావు పాల్గొన్నారు. ఆరిలోవ శివాజీనగర్–2, పెదగదిలి కూడలిలో అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు దళిత నాయకులు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.


15వ వార్డులో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న నడింపల్లి కృష్ణంరాజు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డు సింహాద్రిపురంలో అంబేడర్ చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి నడింపల్లి కృష్ణంరాజు పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అనంతరం పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు సూరిశెట్టి సన్యాసిరావు, కణితి మరియాదాస్, మారడబూడి వేలంగని, రామ్ భక్త నాగరాజు, అనకాపల్లి రమణమ్మ పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీ: లాసన్స్ బే కాలనీలోని విశాఖ ఎంపీ, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటానికి నియోజకవర్గ కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు, వార్డుల ఇన్‌చార్జ్‌లు పూలమాలలు వేసి అంజలి ఘటించారు.


ఏయూలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చంద్రశేఖర్ యాదవ్


ఎంపీ ఎంవీవీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు

కూలిన రక్షణ గోడలు


జీవీఎంసీ పన్నెండో వార్డు బీసీ కాలనీ కొండవాలులో కూలిన గోడ


22వ వార్డులో కూలిన ప్రహరీ

ఆరిలోవ: మిచాంగ్ తుపాను ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కొండవాలులో పలు చోట్ల రక్షణ గోడలు నానిపోయి కూలిపోయాయి. జీవీఎంసీ 12వ వార్డు బాలాజీనగర్ దరి బీసీకాలనీ కొండవాలు, పెదగదిలి సమీప సింహగిరి కాలనీ కొండవాలులో గోడలు కూలిపోయాయి. మంగళవారం అర్ధరాత్రి సమయంలో బీసీ కాలనీలో కొండపై రక్షణ గోడను ఆనుకొని పైభాగంలో ఓ వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నాడు. నిర్మాణంలో భాగంగా రక్షణ గోడను ఆనుకొని లోతుగా తవ్వడంతో ఆధారం కోల్పోయిన రక్షణ గోడ కిందనున్న నివాసాలపై పడిపోయింది. దీంతో ఈగల నూకరాజు, పాండ్రింకి లక్ష్మి, ముగడ లక్ష్మికి చెందిన ఇళ్ల వెనుక భాగాలలో గదులు, సామాన్లు పాడయ్యాయి. ప్రాణం నష్టం, గాయాలు కాకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ, టీడీపీకి చెందిన పలువురు నాయకులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. దీనిపై రూరల్ మండలం రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. ఇదే వార్డు సింహగిరి కాలనీ కొండవాలులో నిర్మాణంలో ఉన్న రక్షణ గోడ మట్టి కిందకు జారిపోయింది.

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 22వ వార్డు మంగాపురం కాలనీ అంగన్‌వాడీ కేంద్రం వెనకు ఉన్న అపార్ట్‌మెంట్ ప్రహరీ కూలిపోయింది. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పీతల గోవింద్.. జీవీఎంసీ సిబ్బందితో వ్యర్థాలను తొలగించేలా చేశారు. సముద్రం అలలు ఉధృతంగా రావడంతో తీర రక్షణ గోడ కోతకు గురైంది. గోకుల్ పార్కు, చిల్డ్రన్ పార్కు ప్రాంతాలలో రక్షణ గోడ చాలా వరకు కోతకు గురై కూలిపోయే స్థితిలో ఉంది. జీవీఎంసీ 28వ వార్డు సంతోష్‌నగర్‌లోని సామాజిక భవనం పెచ్చులు ఊడిపోయాయి. జీవీఎంసీ 21వ వార్డు రెల్లి వీధిలో చెన్నా శ్రీనివాసకు చెందిన ఇల్లు కూలిపోయింది. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు రవికుమార్ ఆ కుటుంబాన్ని సీబీఐ డౌన్‌లో ఉన్న సామాజిక భవనానికి తరలించారు.

కొండవాలు ప్రాంతాలలో పర్యటన

మద్దిలపాలెం : తుపాను కారణంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు 15వ వార్డులోని కొండవాలు ప్రాంతీయుల పరిస్థితిని కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య పరిశీలించారు. వార్డులోని సింహాద్రిపురం, లక్ష్మీ నర్సింహనగర్, కొత్త వెంకోజీపాలెంలో కొండవాలు ప్రాంతాలలో ఇళ్లను సందర్శించారు. తాత్కాలికంగా వసతిగా సింహాద్రిపురం కల్యాణమండపాన్ని వినియోగించుకోవాలని సూచించారు. వర్షానికి దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించారు. గోడల నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించనున్నామని కార్పొరేటర్ తెలిపారు. ఈ పర్యటనలో వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి అప్పారి గిరిబాబు, బుగత ఏసురత్నం, గొలగాని త్రినాథ్, అచ్యుత, నారాయణరావు, అప్పారావు పాల్గొన్నారు.


కొండవాలు ప్రాంతవాసులతో మాట్లాడుతున్న 15వ వార్డు కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య

యుద్ధప్రాతిపదికన పారిశుధ్యం పనులు


కాలువల్లో వ్యర్థాలు తొలగిస్తున్న పారిశుధ్య కార్మికురాలు


పొక్లెయిన్‌తో వ్యర్థాలను తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

ఏయూ క్యాంపస్: తుపాను కారణంగా జీవీఎంసీ 20వ వార్డులో కాలువల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య సిబ్బంది యుద్ధప్రాతిపదికన తొలగించారు. వార్డు పరిధిలో వర్షం కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను కార్పొరేటర్ ముమ్మల లక్ష్మి పరిశీలించారు. విరిగిన చెట్ల కొమ్మలు, రోడ్డుపై పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించేలా చర్యలు తీసుకున్నారు. జోరు వానలోనూ పారిశుధ్య సిబ్బంది తమ సేవలు అందించారు. సాయంత్రం కాస్త వరుణుడు కరుణించడంతో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు.

నేడు సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్ : కనకమహాలక్ష్మి దేవాలయంలో గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 8985515989 నంబరుకు వాట్సప్ చేయాలి.

కార్మికవర్గాన్ని దెబ్బ కొట్టే యత్నమే ప్రైవేటీకరణ


దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని దెబ్బ కొట్టాలనే స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెర మీదకు తెచ్చారని, కేంద్ర ప్రభుత్వం కుట్రలు పోరాటంతో ఎదుర్కొంటామని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు తెలిపారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద 1028వ రోజు ఉక్కు రిలే నిరాహార దీక్షలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తన తీరు మార్చుకుని స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, లేదంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు.

13 నుంచి మార్గశిర మాసోత్సవాలు

దాబాగార్డెన్స్ : కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 13 నుంచి వచ్చే నెల 11 వరకు మార్గశిర మాసోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు బుధవారం ఆలయ ప్రాంగణంలో ఉత్సవాల పోస్టర్‌ను దేవాలయ సంఘం అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, పట్నాల వెంకటరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్గశిర మాసంలో వచ్చే నాలుగు గురువారాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు చెప్పారు. ఉత్సవాల్లో భాగంగా 14న సువర్ణ వస్త్రాలంకరణ, 21న రజత వస్త్రాలంకరణ, 28న ముత్యాల వస్త్రాలంకరణ, వచ్చే నెల 4న అమ్మవారిని పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించనున్నట్టు పేర్కొన్నారు.

ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం


ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న భక్తులు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం భక్తులు స్వహస్తాలతో జలాభిషేకం చేశారు. ఈవో జీవీ రమాభాయి ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాస్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారికి పసుపునీటితో జలాభిషేకం చేసి ప్రత్యేక పూలతో అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పడిపూజ

సీతంపేట: శ్రీబాలమురుగన్ సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక పార్వతీశ్వరాలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి పడిపూజ నిర్వహించారు. పంచామృతాభిషేకాలు, విశేష పూజ, భజనలు చేసి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భాస్కరశర్మ మాట్లాడుతూ కార్తీక పౌర్ణమి నుంచి మార్గశిర శుద్ధ షష్ఠి వరకు 21 రోజులు స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తామన్నారు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా! లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
7331119904, 9912440606

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వైజాగ్ ఈస్ట్
9912220751, 9010055116
Office mail : sakshiadvtvsp@gmail.com